క్లుప్తంగా

జోన్-5 'స్పందన'కు నాలుగు వినతులు



వినతిపత్రాలు పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 04 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 02, పబ్లిక్ హెల్త్‌కు 01, యూసీడీకి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాస్‌రావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ అధికారి అపరంజిత, పబ్లిక్ హెల్త్ సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్వో ఏపీడీ కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.

కొత్త సీవోకు అభినందన



సీవో మంగను అభినందిస్తున్న కార్పొరేటర్ పద్మావతి

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు కొత్త సీవోగా నియామకమైన మంగను కార్పొరేటర్ తోట పద్మావతి అభినందించారు. ఆర్పీలతో కలిసి సీవో మంగ సోమవారం కార్పొరేటర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి డ్వాక్రా సంఘాలతో మమేకమై పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా కృషి చేయాలని పద్మావతి కోరారు.

సమస్యలు పరిష్కరించండి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

మహారాణిపేట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆందోళనకు దిగారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ అధ్యక్షురాలు బి.తులసి మాట్లాడుతూ వేసవిలో ఎండ తీవ్రత వల్ల గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి భోజనాలు చేయలేక చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. మేలో వారికి టేక్ హోమ్ రేషన్ ఇచ్చేలా అధికారులు అనుమతివ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.పద్మ, ఆర్.శోభారాణి, ఎల్.దేవి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం-1 చివరలో గల పార్సిల్ ఆఫీస్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్పీ) ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ వి.బాలాజీరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం ప్లాట్‌ఫారం-1 చివరలో సుమారు 25 ఏళ్ల గల ఓ వ్యక్తి మరణించాడని, తెలుపు రంగు ప్యాంట్, తెలుపు నలుపు రంగు చెక్స్ గల రౌండ్ నెక్ టీ షర్ట్ ధరించి ఉన్నాడని బాలాజీరావు చెప్పారు. ఇతని వద్ద ఏవిధమైన ఆధారాలు లేవని, వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీని గానీ లేదా 96661 22722 / 94406 27547 నంబర్లలో తెలియజేయాలన్నారు.

మండుటెండల్లోనే బతుకు బండి..



టన్నుల కొద్దీ బరువును మండుటెండలో తీసుకెళ్తున్న పెద్దాయన



ఇంటి పట్టున ఉండాల్సిన అమ్మ.. మండుటెండలో చెప్పులు కుడుతూ..

- జీవన పోరాటంలో కాలచక్రాన్ని నడిపిస్తున్న వృద్ధులు
- శ్రమ తప్ప.. సుఖం తెలియని అభాగ్యులు



ఏడు పదుల వయసులో భానుడి ప్రతాపాన్ని కూడా లెక్క చేయకుండా బతుకుబండి ఈడుస్తూ..

డాబాగార్డెన్స్: నెత్తిన సూరీడు మండిపోతున్నాడు. పక్షం రోజులుగా ఎండ తీవ్రత తారాస్థాయికి చేరుతోంది. బయటికొస్తే.. నిప్పుల కొలిమి.. ఇంట్లో ఉంటే ఊపిరాడదు. ఇలాంటి పరిస్థితుల్లో పలువురు కార్మికులు, తోపుడు బళ్ల వ్యాపారులు, కూలీలు బతుకు బండిని లాగేందుకు ఎండలోనే కష్టపడుతున్నారు. ఇక రోజు కూలీలు, రిక్షా కార్మికులు, పారిశుధ్య సిబ్బంది, లారీ డ్రైవర్లు, క్లీనర్లు, చిల్లర వ్యాపారులు వీరంతా మండుటెండలోనే పనులు చేస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూట గడవాలంటే ఎండా.. వాన చూడలేం కదా.. బాబూ అంటూ వారిని కదిలిస్తే సాక్షికి బదులిచ్చారు. వీరంతా దాదాపు ఆరు.. ఏడు పదుల వయస్సు మీరిన వారే. వీరికి కొడుకులు.. కుమార్తెలు ఉన్నా.. పట్టించుకుంటున్నారో లేదో తెలీయదు గానీ మండుటెండలోనే బతుకుబండి ఈడుస్తున్నారు. ఏ పాటి చిన్న ఎండ తగిలినా.. బాబోయ్ ఎండలు మండిపోతున్నాయంటూ ఫ్యాన్లు.. ఏసీల ముందు కూర్చుంటాం. అటువంటిది అగ్నిగుండాన్ని తలపించే మండుటెండలో ఇలా కష్టపడుతూ బతుకుబండి ఈడుస్తున్నారు. బండిపై టన్నులకొద్దీ బరువును మోసుకెళ్తూ.. జీవిత చక్రాన్ని ఈడ్చుకెళ్తూ సాక్షి కంటపడ్డారిలా. ఏడు పదుల వయస్సులో అమ్మ మండుటెండలో చెప్పులు కుడుతూ కనిపించింది. అలాగే ఓ పెద్దాయన తోపుడుబండిపై లగేజీ తీసుకెళ్తూ భానుడి ప్రతాపానికి కకావికలమవుతూ కనిపించాడు. ఇలా వీరే కాదు.. ఎందరో వయసు మీరిన వృద్ధులు పొట్టకూటి కోసం మండుటెండను లెక్కచేయకా.. బతుకుబండిని లాగుతున్నారు.. చెమట్లు చిందిస్తూ కాలచక్రానికి ఎదురీదుతున్నారు.

కాలుష్య నియంత్రణకు దూరం..!

- ప్రజా రవాణాను వినియోగించని జోన్-5 అధికారులు
- ప్రభుత్వ, సొంత వాహనాల్లో కార్యాలయానికి రాక



జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయ ఆవరణలో సోమవారం పార్క్ చేసిన అధికారుల వాహనాలు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 అధికారులు, ఉద్యోగులు కాలుష్య నియంత్రణలో భాగస్వాములు కాలేదనే చెప్పాలి. జీవీఎంసీ మేయర్, కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు నగరాన్ని కాలుష్యం బారి నుంచి కాపాడాలని పిలుపునిస్తూ ప్రతి సోమవారం వెహికల్-ఫ్రీ జోన్ పాటించి తమ వంతు కృషి చేస్తున్నారు. జోన్-5 అధికార గణం మాత్రం ఇందుకు దూరంగా ఉంటోందని పలువురు విమర్శిస్తున్నారు. జోన్-5లో ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్, యూసీడీ, టౌన్ ప్లానింగ్, డెత్ అండ్ బర్త్, తాగునీరు, విద్యుత్ లైట్లు, రెవెన్యూ విభాగాల అధికారులు మాత్రం ప్రభుత్వ వాహనాలతోపాటు సొంత వాహనాల్లో ప్రతి సోమవారం జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయానికి విధులకు వస్తున్నారు. ఇక్కడి సౌకర్యం కేంద్రానికి వచ్చే జోన్ ప్రజలు కూర్చోడానికి చోటులేక పోయినా.. జోనల్ విభాగాల అధికారుల వాహనాల పార్కింగ్‌తో కార్యాలయం ప్రతి సోమవారం కళకళలాడుతోందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందని, దాని కట్టడికి అందరి సహకారం అవసరమని, ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు కాలుష్య నియంత్రణకు వారంలో ఒక్కరోజు ప్రజా రవాణాను ఉపయోగించాలని ప్రభుత్వం సూచించినా.. జోన్-5 అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కాలుష్య నియంత్రణకు జోనల్ అధికారులు, ఉద్యోగులు సహకరించాలని సూచిస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రహరీ నిర్మాణం



ప్రహరీ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం జేఎన్ఎన్ఆర్‌యూఎం కాలనీలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ సొంత నిధులతో ప్రహరీ గోడ నిర్మిస్తున్నారు. సోమవారం ఈ పనులను శ్రీధర్ పరిశీలించి మాట్లాడుతూ సుమారు రూ.50 వేలతో ప్రహరీ, షెడ్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. బలహీన వర్గాల అభ్యున్నతికి బాబా సాహెబ్ అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు వేళంగిణీరావు, శ్రీను, సునీల్, కమల్‌కుమార్, ప్రభాత్, నారాయణరావు, బాబ్జీ, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు త్వరితగతిన పూర్తి చేయండి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



అడవివరంలో పారిశుధ్య పనులపై అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

సింహాచలం: సింహగిరితో పాటు అడవరం, కొండ దిగువన పారిశుధ్య పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ప్రజా ఆరోగ్య విభాగ అధికారులను ఆదేశించారు. చందనోత్సవం అనంతరం సోమవారం ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యర్థాలను వెంటనే డంపింగ్ యార్డ్‌కు తరలించాలని అధికారులను ఆదేశించారు. పాత అడవివరం జంక్షన్ నుంచి పాత గోశాల గోశాల వరకు ఎక్కువగా వ్యర్థాలు ఉన్నాయని రెండు పూటలా పారిశుధ్య కార్మికులను ఉంచి శుభ్రం చేయించాలని సూచించారు. చెత్త తరలించే వాహనాలు అదనపు ట్రిప్పులు వేయాలని ఆదేశించారు. వ్యర్థాలు తరలించేటప్పుడు వాహనాలకు తప్పనిసరిగా నెట్ ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, 8వ జోన్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఈఈ సంతోషి, పారిశుధ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

రంగసాయి నాటక గ్రంథాలయం వార్షికోత్సవం రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: రంగసాయి నాటక గ్రంథాలయం వార్షికోత్సవ వాల్‌పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. గ్రంథాలయ వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి, సీనియర్ జర్నలిస్ట్ ఎస్.నాగేశ్వరరావు, గ్రంథ పాలకుడు జమ్మా చిన్నబాబు సాయంత్రం వీసీని కలిసి వార్షికోత్సవ వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశంలోనే తొలి నాటక గ్రంథాలయం విశాఖ నగరంలో ఉండటం గర్వకారణమన్నారు. 11 ఏళ్లలో 10 వేలకు పైగా నాటక పుస్తకాలు సేకరించడం సాధారణ విషయం కాదని కొనియాడారు. టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని రంగసాయి నాటక గ్రంథాలయంలో ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు వార్షికోత్సవం నిర్వహించనున్నట్టు బాదంగీర్ సాయి తెలిపారు. వేడుకల్లో భాగంగా ప్రముఖ నాటక రచయితలు కొరిటాల ప్రభాకరరావు, పి.టి.మాధవ్, దండు నాగేశ్వరరావు, విశ్వనాథ గణపతిరావు, రావి నాగేశ్వరరావును సత్కరించనున్నామన్నారు. కన్యాశుల్కం లఘు నాటిక, ఆలు లేదు చూలు లేదు.. కొడుకు పేరు సోమలింగం హాస్య ప్రహసనం ఉంటాయని సాయి చెప్పారు.

80 మంది రక్తదానం



రక్తదాతకు సర్టిఫికెట్ అందిస్తున్న ఎస్.కె.రావు

మహారాణిపేట: సంత్ నిరంకారీ మిషన్ అనుబంధ సంస్థ సంత్ నిరంకారీ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మహారాణిపేట రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ వై.శివనాగేంద్రరెడ్డి, జిల్లా సంత్ నిరంకారీ మండలి ఇన్‌చార్జి ప్రేమ్ మిర్‌పూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 80 మంది రక్తదానం చేశారు. వారికి రెడ్‌క్రాస్ ప్రతినిధులు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సేవాదళ్ క్షత్రియ సంచాలకుడు డి.ఎ.ఆర్.రాజు, రెడ్‌క్రాస్ కార్యదర్శి రవికుమార్, కోశాధికారి ఎస్.కె.రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



ధనలక్ష్మికి నగదు అందజేస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డుకు చెందిన కడితి రమణమ్మ అనే మహిళ ఈ నెల 20వ తేదీన అనారోగ్యంతో మృతి చెందింది. వైఎస్సార్ బీమా పథకం తక్షణం సాయం కింద సోమవారం ఆమె కోడలు కడితి ధనలక్ష్మికి వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి రూ.10 వేలు అందజేశారు. యాతపేట సచివాలయం కన్వీనర్లు కె.నాగమణి, పిల్లి సత్తిబాబు, సచివాలయ అడ్మిన్ వెంకటరావు, వెల్ఫేర్ సెక్రటరీ రమేజ, వలంటీర్ ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, బొలెం అశోక్, టి.సాయి, కె.నాగమణి, ఈశ్వరి తదితరులు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

మహారాణిపేట: సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సోమవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అక్షయపాత్ర నిర్వహణలో ఉన్న జీవీఎంసీ ఆనందపురం, భీమిలి మండలాల్లో రాగిజావ వండుతున్నందుకు ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, పాత్రలు, గరిటెలు ఇవ్వాలని, వాటి శుభ్రతకు సబ్బులు, సర్ఫ్ అందించాలని, అదనపు పని చేయిస్తున్నందుకు వేతనాలు పెంచాలని వారు కోరారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.తులసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రాగిజావ వండి, సరఫరా చేయమని ఆదేశాలిచ్చిందన్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఒకే ఒక్క మిడ్డే మీల్ వర్కర్‌ను జీవీఎంసీ పరిధిలో నియమించడం వల్ల తీవ్ర పని భారం ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. పెరుగుతున్న ధరల రీత్యా ప్రభుత్వమే గ్యాస్, సరకులు సరఫరా చేయాలని, పాఠశాలల్లో శనివారం మెనూ మార్చి పనిభారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వారంతా స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ఎ.మల్లికార్జునకు వినతిపత్రం అందించారు.

ఉత్సాహంగా ఇంటింటికీ..



కుమ్మర వీధిలో సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న రంధి గోపీకృష్ణ, పావని ప్రసాద్ తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటా చురుగ్గా ప్రచారం చేస్తున్నారు. కుమ్మర వీధి సచివాలయ కన్వీనర్ పోలవరపు పావని ప్రసాద్, గృహసారథులు కుమ్మర వీధిలో సోమవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని గృహిణులకు వివరించి, వారితో మిస్డ్ కాల్ చేయించారు. పార్టీకి ప్రజలు స్వచ్ఛందంగా తమ వంతు మద్దతు తెలియజేస్తున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, పోలవరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు బ్రహ్మరథం

- లక్షలాది మిస్డ్ కాల్స్ ద్వారా అభిమానం చాటిన ప్రజలు
- సంఘీభావంగా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సూచనలు.. సలహాలతో జీవీఎంసీ 31, 32, 27, 42 వార్డులకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 'సాక్షి'గా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా లక్షలాది మిస్డ్ కాల్స్ ద్వారా అభిమానం చాటిన ప్రజలకు సంఘీభావం తెలుపుతూ సోమవారం డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్-1 ఇన్‌చార్జ్ దొడ్డి రామానంద్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, వలంటీర్లు బాబా సాహెబ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రామానంద్ మాట్లాడుతూ రెండు వారాలుగా రాష్ట్రమంతటా జగనన్న జపమే ప్రజలంతా చేస్తున్నారని, ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. ఇంటింటా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ప్రజల్లో ఉన్న అభిమానంతో రెట్టించిన ఉత్సాహంతో కన్వీనర్లు, గృహసారథులతో ప్రతి ఇంటికీ వెళ్లి వారి ఆశీస్సులు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు సర్వేశ్వరరెడ్డి, 31వ వార్డు నాయకుడు దొడ్డి బాపూ ఆనంద్, దక్షిణ నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకుడు బోని దేవా తదితరులు పాల్గొన్నారు.

30న 'మే డే' సాంస్కృతిక ఉత్సవాలు



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'మే డే' సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నట్టు కేంద్రం ప్రతినిధి జీఎస్ రాజేశ్వరరావు, సాంస్కృతిక విభాగం ప్రతినిధి దండు నాగేశ్వరరావు తెలిపారు. ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. నగరంలోని కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు వారి కుటుంబ సభ్యుల్లో కళా ప్రావీణ్యం గల వారందర్నీ ఒక తాటిపైకి తెచ్చి ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పండగ వాతావరణంలో మేడే సాంస్కృతిక ఉత్సవాలు జరపనున్నట్టు చెప్పారు. పాటలు, పద్యాలు, శ్రామిక అభ్యుదయ గీతాలకు శాస్త్రీయ నృత్యాలు, కోలాటం, తప్పెటగుళ్లు, ఏకపాత్రాభినయాలు, ఫ్లూట్ తదితర వాయిద్య కళారూపాలు, మిమిక్రీ, హాస్యం, షార్ట్ ఫిలిమ్స్ తదితర కళారూపాల్లో ప్రావీణ్యం ఉన్న వారంతా యూనియన్లు, అనుబంధ రాజకీయాలతో సంబంధం లేకుండా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రదర్శించే ఏ కళారూపమైనా విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ సంస్థల పరిరక్షణ, దేశభక్తి, దేశ సమైక్యత, సమగ్రత, లౌకికతత్వం, సామాజిక న్యాయంపై ప్రదర్శించాలని కోరారు. పాల్గొనే వారు ఈ నెల 25 లోపు తమ ఎంట్రీలను 9490750661, 9490098794 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎల్లాజీ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై అవగాహన



భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న శాఖ సభ్యులు

డాబాగార్డెన్స్: సాంద్ర సింధు వేదం సారాంశ దాత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత భగవద్గీత, ఇతర గ్రంథాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్, జీవీఎంసీ గాంధీ పార్కు తదితర ప్రాంతాల్లో త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక విశాఖపట్నం శాఖ సభ్యులు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, విజయ్, తిరుపతి, అరుణకుమార్, అప్పలనాయుడు, రాజారావు, అక్షయకుమార్, రమణ, కె.వి.రావు, కార్తీక్, అప్పారావు, ఎస్.వి.రమణ, దేవి, మంగ, సర్వధారి, నాగమణి, పద్మ తదితరులు త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

'ఆశీలు సొమ్ము పక్కదారి'పై స్పందించని అధికారులు

- యథావిధిగా ప్రైవేటు వ్యక్తుల దందా
- ఇబ్బందులకు గురవుతున్న మార్కెట్ వ్యాపారులు


ఆశీలు సొమ్ము పక్కదారి

'సాక్షి'లో ప్రచురించిన వార్త

జగదాంబ: జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించకపోవడంతో ప్రైవేటు వ్యక్తుల ఆశీలు దందా ఎక్కువైపోయింది. జోన్-4 పరిధి పూర్ణామార్కెట్, రామ కృష్ణ రైతుబజార్‌ల్లో గతేడాది ఆగస్టు నుంచి అధికారులు సెక్రటరీలను, కింది స్థాయి సిబ్బందిని నియమించి ఆశీలు వసూలు చేస్తున్నారు. ఇందులో కొందరు ఉద్యోగులు ప్రైవేటు వ్యక్తులతో చేతులు కలిపి వసూల్ అప్పగించారు. వారి ద్వారా వచ్చిన సొమ్మును సగం జీవీఎంసీకి చెల్లించి.. మిగతాది ప్రైవేటు వ్యక్తుల జేబుల్లోకి చేరుతున్న నేపథ్యంలో స్వయంగా 'సాక్షి' కెమెరాకు చిక్కిన దృశ్యంతో 'ఆశీల సొమ్ము పక్కదారి' అనే శీర్షికన ఇటీవల వార్త ప్రచురితమైంది. దీనిపై జీవీఎంసీ ఉన్నతాధికారులు కనీసం స్పందించకుండా ఉండటంతో ప్రైవేటు వ్యక్తులు వసూల్ పర్వం ఆగలేదు. దీనివల్లో మార్కెట్‌లో వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. జీవీఎంసీ డిపార్ట్‌మెంట్ కలెక్షన్లు చేస్తున్నా అధికంగా వాహనానికి రూ.250 నుంచి రూ.350కు పైగా వసూల్ చేస్తున్నారని చెబుతున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విజయవంతంగా 'మా నమ్మకం నువ్వే జగన్'



క్లస్టర్ ఇన్‌చార్జ్ కర్రి నీలకంఠాన్ని సత్కరిస్తున్న రంధి గోపీకృష్ణ, బొడ్డేటి ప్రసాద్ తదితరులు

అల్లిపురం: క్లస్టర్ స్థాయిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విజయవంతమైందని 33, 34, 35, 41 వార్డుల క్లస్టర్ ఇన్‌చార్జ్ కర్రి నీలకంఠం హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం అచ్చియ్యమ్మపేట జీవీఎంసీ పాఠశాల ఆవరణలో క్లస్టర్ పరిధిలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులతో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 34, 35 వార్డుల కార్పొరేటర్లు తోట పద్మావతి, విల్లూరి భాస్కరరావు, పార్టీ 34వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ చేతుల మీదుగా గృహసారథులు, కన్వీనర్లను ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా చేపట్టి జగనన్న సైనికులమని అనిపించుకున్నారన్నారు. కర్రి నీలకంఠాన్ని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి లండా రమణ, సీనియర్ నాయకులు లింగం శ్రీనివాసరావులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్తేటి ఊర్వశి, యల్లంకి చిన్నమ్మలు, దూడ అప్పారావు, బొడ్డు పోలరావు, వాసుపిల్లి నారాయణ, నీలాపు అయ్యప్పరెడ్డి, ఆడారి వెంకటమహేష్, పోలవరపు ప్రసాద్, కణితి బ్రహ్మం, కొడమంచిలి శివ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.